క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు ఉదయం 9:30 నుంచి 10:30 వరకు 0877–2227208కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే ఉదయం 10:30 నుంచి నేరుగా అధికారులకు వినతి పత్రాలు అందజేయవచ్చని వెల్లడించారు.

శ్రీవారి సేవలో ప్రభుత్వ విప్

తిరుమల: శ్రీవారిని ఆదివారం ప్రభుత్వ విప్ ప్రసాద్ రాజు దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సంతలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): నిత్యం ప్రజా సంక్షేమం కోసం తపించే మనసున్న మారాజు వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా రైతులు, వ్యాపారుల కోసం ప్రతి వారం వారపు సంతల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం చంద్రగిరి వారపు సంతలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో రెడ్డివారిపల్లి సర్పంచ్ ప్రకాష్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

తిరుపతి రూరల్: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తిరుపతి జిల్లా పాల ఏకరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. తిరుపతి యూత్ హాస్టల్లో ఆదివారం సాయంత్రం సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత మంచి ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఉమామహేష్, ప్రధాన కార్యదర్శి సురేంద్ర నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

శిల్పారామం.. కళావైభవం



తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నెల్లూరుకు చెందిన శ్రీనటరాజ కళాక్షేత్రం గురువు త్రిపుర నిఖిత పర్యవేక్షణలో కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం అలరించింది. పలు పాటలకు కళాకారులు అశ్రిత, గీతా కృష్ణ, హర్షర కృష్ణ, జ్ఞాన హర్షిత, లిఖిల సాహితి, పల్లవి, జైశ్వీ, తపస్విని హావభావాలు, అభినయం ఆకట్టుకుంది. వారిని ఏఓ ఖాదర్‌వలీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

నాడు...
పింఛన్, రేషన్ కార్డు, ఇంటి పట్టాలు కావాలంటే అధికారులు, నాయకుల చుట్టూ రోజుల తరబడి తిరిగాల్సి వచ్చేది. అయినా పనులు అవుతాయనే నమ్మకం ఉండేది కాదు. రెవెన్యూ సమస్యలు సరేసరి. ముఖ్యంగా భూముల సర్వేకు చలానా చెల్లించి నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు కనికరించేవారు కాదు. కొంతమంది మన ఖర్మ అనుకుని మిన్నకుండిపోయేవారు.

నేడు...
రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు సత్వరం అందుతున్నాయి. అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయి. రేషన్‌కార్డు, పింఛన్లు, ఇళ్ల పట్టాలు దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోనే వలంటీర్ల ద్వారా సచివాలయ సిబ్బంది పరిశీలన చేసి అర్హత ఉంటే వెంటనే మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలను అందుబాటులో ఉన్నాయి.

ఇంటి ముంగిటకే పాలన

- ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ
- గ్రామాల్లోనే 500 సేవలు
- ఇబ్బందులు తప్పాయంటున్న ప్రజలు

మండలం పేరు	:	చిన్నగొట్టిగల్లు
సచివాలయాలు	:	10
గ్రామ పంచాయతీలు	:	13
మండల జనాభా	:	26080
ఇళ్ళ సంఖ్య	:	7892
సచివాలయాల సిబ్బంది	:	84
గ్రామ, వార్డు వాలంటీర్లు	:	166

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో 7892 ఇళ్లు ఉండగా 26,080 మంది జనాభా ఉన్నారు. 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 10 సచివాలయాలను ఏర్పాటు చేశారు. వీటిలో 84 మంది వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి అదనంగా 166 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వలంటీర్లు ప్రజలకు, సచివాలయాలకు వారధిగా ఉంటూ ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా చూస్తున్నారు. పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వయంగా తీసుకెళ్లి సచివాలయాల్లో అందజేస్తూ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పింఛను, రేషన్ కార్డు, ఇళ్ల పట్టాలు, వైద్యం, ఆరోగ్యం, రెవెన్యూ, భూముల సర్వే, శిశు సంక్షేమం, డెయిరీ, ఫార్మ్రీ తదితర పనులన్నీ సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే మంజూరవుతున్నాయి.



సచివాలయం

జగనన్న ప్రభుత్వంలోనే పింఛను మంజూరు



మాది చిన్నగొట్టిగల్లు. నాకు అంగవైకల్యం ఉంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛను కోసం పలు మార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. కార్యాలయం వద్ద ధర్నా చేసినా ఫలితం లేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛను దరఖాస్తు రాసుకుని పోయి మంజూరు చేయించారు. ప్రతి నెలా మా ఇంటికే వచ్చి పింఛను ఇస్తున్నారు. ఇది నేను నా జీవితంలో మరిచిపోలేని విషయం. –ఖాదర్‌వలి, చిన్నగొట్టిగల్లు

సచివాలయంలోనే భూ రికార్డులు



మండల కేంద్రానికి మా ఊరు 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. గతంలో రెవెన్యూ సమస్యల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అయినా పని జరుగుతుందన్న నమ్మకం ఉండేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. భూమికి సంబంధించిన ఏ సమస్య అయినా సచివాలయంలోనే పరిష్కరిస్తున్నారు. మా వలంటీర్‌కు చెబితే తీసుకొచ్చి మా ఇంటికే ఇస్తున్నారు. సచివాలయ సేవలతో పనులు వదులుకునే బాధ తప్పింది. –హేమంత్‌కుమార్‌రెడ్డి, బోడిరెడ్డిగారిపల్లె, చిట్టిచెర్ల పంచాయతీ

అన్ని సర్టిఫికెట్లు మా ఊళ్లోనే తీసుకుంటున్నాము



మాది తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ టి.దళితవాడ. సచివాలయ వ్యవస్థలో గ్రామ, వార్డు వలంటీర్లు వచ్చిన తరువాత మా పిల్లలకు కావాల్సిన సర్టిఫికెట్లు మా ఇంటికే తెచ్చి ఇస్తున్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలు. మళ్లీ మళ్లీ తిరిగే పని లేకుండా వలంటీర్ల ద్వారా అందుతున్నాయి. ఆదాయం, కులం, నివాసం తదితర అన్ని సర్టిఫికెట్లు సచివాలయంలోనే తీసుకుంటున్నాం. గతంలోలా ఇబ్బందులు లేవు. –సుబ్రమణ్యం, తిప్పిరెడ్డిగారిపల్లె

స్కూల్ పిల్లలకు తిప్పల్లేవు



గతంలో పిల్లలకు సంబంధించి కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం మండల రెవెన్యూ కార్యాలయం వద్దకు పరుగులు తీయాల్సి వచ్చేది. దీంతో పిల్లలకు స్కూలు తప్పేది. ఇప్పుడు అలా కాదు. సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే చాలు. ఏ కార్యాలయానికి వెళ్లాల్సిన పనిగాని, అధికారులు చుట్టూ తిరిగే పనిగాని లేదు. సర్టిఫికెట్ వలంటీర్ ద్వారా ఇంటికి చేరుతుంది. –ప్రవీణ్‌కుమార్, విద్యార్థి సంఘం నాయకుడు, చిన్నగొట్టిగల్లు

ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ఆగస్టు 7వ తేదీన తిరుపతి నగరంలో భారీ స్థాయిలో జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్టు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ నిర్వహణపై వివిధ జిల్లాల నేతలతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ గతంలో బీపీ మండల్ కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయడంలో ప్రభుత్వాలు వివక్ష చూపాయని, దీంతో బీసీల బతుకులు మరింత దిగజారాయన్నారు. దేశ వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సుమారు 85 శాతం ఉన్నా అభివృద్ధి శూన్యమన్నారు. బీపీ మండల్ నివేదిక సమర్పించిన రోజైన ఆగస్టు 7వ తేదీన తిరుపతి నగరంలో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌కే.యాదవ్, నాయకులు వెంకటేశ్వర్లు, రఘుపతి, జ్ఞాన జగదీష్, బ్రహ్మానంద శర్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హియరింగ్ టెస్ట్‌కు విశేష స్పందన



బ్లూ టూత్, మొబైల్ కనెక్టివిటీ, పరికరాలు ఇస్తున్న తిరుపతి స్పీచ్ హియరింగ్ సెంటర్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సెంటర్‌లో శని, ఆదివారాలు నిర్వహించిన ఉచిత హియరింగ్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. వినికిడి సమస్యలు కలిగిన వారు సుమారు 80 మంది పాల్గొని ఉచిత పరీక్షలు చేయించుకున్నట్టు నిర్వాహకుడు డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా హియరింగ్ వస్తువులు అవసరమైన వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన బ్లూ టూత్, మొబైల్ కనెక్టివిటీ, డిజిటల్ హియరింగ్ పరికరాలు ఉచితంగా ట్రైల్స్ ఇచ్చామని, అవగాహన కల్పించామని తెలిపారు.

నయనానందకరం.. నాటకాభినయం



రాయబారం నాటకంలోని ఒక సన్నివేశం

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి కోనేటి సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటికలు నయనానందకరంగా సాగాయి. కోనేటి సుబ్బరాజు సోదరుడు, టీటీడీ ఏఈవో దుర్గరాజు వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పిఠాపురం స్నేహాంజలి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'చింత చచ్చినా' సాంఘిక నాటిక కనుమరుగుతున్న మనుషుల బాంధవ్యాలను ఆవిష్కరిస్తూ వాటిని పరిరక్షించుకున్నప్పుడే కుటుంబ వ్యవస్థ పురోభివృద్ధి చెందడంతోపాటు సమాజ శ్రేయస్సుకు ఎలా ఉపయోగపడుతుందో తెలియజేసింది. తిరుపతి కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయభారం పౌరాణిక పద్యనాటకంలో పాండవుల లక్క ఇల్లు దగ్ధం నుంచి కృష్ణుడి రాయభారం వరకు చక్కటి సన్నివేశాలతో అద్భుత సెట్టింగ్స్ మధ్య నాటకాన్ని రక్తి కట్టించారు. అనంతరం నిర్వహించిన సభా కార్యక్రమానికి టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ సీఈవో పీవీ.శేషారెడ్డి, చీఫ్ ఆడిట్ శేషశైలేంద్ర, అన్నదానం స్పెషల్ ఆఫీసర్ జీఎల్ఎస్.శాస్త్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, బ్లిస్ హోటల్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి అతిథులుగా హాజరై నాటక కళా వైభవాన్ని కొనియాడారు. కోనేటి సుబ్బరాజు నాటక కళా రంగానికి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా కళాకారులను, అతిథులను నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజు శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం



మోహిత్‌రెడ్డిని కలిసి ఆహ్వానిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

భాకరాపేట : తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారానికి రావాలని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని నూతన చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఆయన ఆదివారం తుమ్మలగుంటలో వారిని కలిసి ఈ నెల 21న తలకోన పుణ్యక్షేత్రంలో జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి రావాలని విజ్ఞప్తి చేశారు. బోడేవాండ్లపల్లె సర్పంచ్ మధుసూదనరెడ్డి, ఎంపీటీసీ చందన పాల్గొన్నారు.

కొండపై తరగని రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. వేసవి సెలవులు ముగిసినా భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీవారి దర్శనం కోసం తరలివస్తున్నారు. శ్రీవారి మెట్టుతో పాటు అలిపిరి మార్గంలో కాలినడకన పెద్ద సంఖ్యలో వస్తున్నారు. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. - తిరుమల



మాడవీధిలో ఉన్న భక్తులు





కాలినడకన వస్తున్న భక్తులు



అఖిలాండం వద్ద పూజలు



మెట్ల మార్గంలో భక్తుల పూజలు



నేటి నుంచి పనపాకంలో ఉచిత వైద్య పరీక్షలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు, వైస్ ఎంపీపీ వెంకటరత్నం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు సోమవారం నుంచి 20వ తేదీ వరకు ఉచిత మెగా వైద్య పరీక్షలను నిర్వహించనున్నారు. పనపాకం హైస్కూల్, అరిగిలవారిపల్లి ప్రాథమిక పాఠశాల, రవణప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉదయం 7 గంటల నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ఆదివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు, చంద్రగిరి ఎంపీడీవో రమేష్‌బాబు పరిశీలించారు. శిబిరానికి వచ్చే డాక్టర్లతో పాటు ప్రజలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శశిరేఖ, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, నాయకులు పానేటి చెంగల్రాయులు, రెడ్డెప్ప, రామచంద్రయ్య, నాగభూషణం, చెంగల్రాయులు, ఢిల్లీశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



ప్రిన్సిపాల్‌ని సత్కరిస్తున్న అధ్యాపకులు, అతిథులు

పాకాల : జీవితంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఆదివారం 15వ వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. లక్ష్యం, మార్గం, శ్రమ సూత్రాలను అనుసరించడం ద్వారా విద్యార్థులు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ కాలం చాలా విలువైనదని, దాన్ని వృథా చేయకుండా జీవితాన్ని చక్కదిద్దుకోవాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ మోహన్‌నాయుడు మాట్లాడుతూ విద్యాతో పాటు నైపుణ్యాలు పెంచుకుంటేనే పోటీ ప్రపంచంలో నెగ్గుతామని గుర్తు చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీ రామచంద్రారెడ్డి, వెంకటప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, రమేష్‌కుమార్, ఈశ్వర్‌బాబు పాల్గొన్నారు.

రమాదేవిలో ఉచిత శస్త్ర చికిత్సల క్యాంపు



డాక్టర్ శశిధర్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతిలోని రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో ఉచిత శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డీబీ శశిధర్ రెడ్డి ఆదివారం మీడియాకు తెలిపారు. సాయిరాం వీధి భవానీ నగర్ సర్కిల్‌లోని ఆసుపత్రిలో ఈ స్పెషల్ క్యాంపును నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 6 వరకు ఉచిత శస్త్ర చికిత్సల క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. కడుపు ఆపరేషన్లు, కిడ్నీలో రాళ్ల తొలగింపు, హెర్నియా, థైరాయిడ్, రొమ్ములో గడ్డలు, వెన్నెముక తదితర ఆపరేషన్లకు సంబంధించి పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి శస్త్ర చికిత్సలను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ఇతర స్కీముల ద్వారా ఉచితంగా చేస్తామన్నారు. వివరాలకు 9849677970, 9502101223లో సంప్రదించాలని సూచించారు.

ఆగస్టులో పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు

తిరుపతి కల్చరల్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు తిరుపతిలో ఆగస్టు 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానం, విదేశీ వర్సిటీలను దేశంలోకి ఆహ్వానించే యూజీసీ ముసాయిదాను వ్యతిరేకిస్తూ విద్యారంగ పరిరక్షణ, నిరుద్యోగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఉపాధ్యక్షుడు ఆదిశేషు, సహాయ కార్యదర్శులు రాజేష్, నాని, సభ్యులు వినోద్, అఖండ, వీరేంద్ర, క్రాంతి, రాంబాబు, ధనశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

అలరిస్తున్న భువనేశ్వరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్



విద్యుత్ వెలుగుల్లో ఎగ్జిబిషన్ ముఖద్వారం



పిల్లలను ఆకట్టుకుంటున్న వాటర్ బోటు



ఎగ్జిబిషన్‌లో అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : డీబీఆర్ రోడ్డులోని యాలమూరి పార్క్‌లో ఏర్పాటు చేసిన భువనేశ్వరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, మ్యూజికల్ చైర్స్, కాటర్ పిల్లర్, డాషింగ్ కార్స్ తదితర సరికొత్త అమ్యూజ్‌మెంట్స్ చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఎగ్జిబిషన్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాటర్ బోట్లు, బైక్ రైడర్స్ చిన్న పిల్లల్ని ఆనందభరితుల్ని చేస్తున్నాయి. ఇవేకాక రుచికరమైన ఆహార పదార్థాలు, అలంకరణ వస్తువులు, మహిళల ప్రత్యేక అలంకరణ వస్తువులు, ఆభరణాలు, వస్త్రాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి.

జేఈఈ అడ్వాన్సుడు ఫలితాల్లో నారాయణ ప్రభంజనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థ డీజీఎం కొండలరావు



తల్లిదండ్రులతో సి.బాబుసుజన్‌రెడ్డి



తల్లిదండ్రులతో శశాంక్‌రెడ్డి పిన్ను



తల్లిదండ్రులతో సి.మిఖిల్

తిరుపతి ఎడ్యుకేషన్ : జేఈఈ అడ్వాన్సుడు ఫలితాల్లో తిరుపతిలోని నారాయణ విద్యాసంస్థ విద్యార్థులు జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్టు ఆ విద్యాసంస్థ డీజీఎం కొండలరావు తెలిపారు. సి.బాబుసుజన్‌రెడ్డి జాతీయ స్థాయిలో 34వ ర్యాంకు, సి.మిఖిల్ 71, శశాంక్‌రెడ్డి పిన్ను 90, క్రితి బేతు 698, కె.భువనచంద్ర 801 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. పదివేలలోపు 18 మంది, 21 వేలలోపు 8 మంది ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. తమ విద్యార్థులు 40 మందికి పైగా ఐఐటీ, వంద మందికి పైగా ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీవో

పాకాల: పాకాల ఎంపీడీఓ పీఎంఆర్ ప్రభాకర్ ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలిశారు. ప్రజల సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు.